క్లుప్తంగా

పారిజాత గిరిలో అష్టదళ పాదపద్మారాధన సేవ



వేంకటేశ్వర స్వామి

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా స్వామి వారికి అష్టదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. 108 మంది భక్తుల విరాళాల ద్వారా సేకరించిన స్వర్ణ పుష్పాలతో వరాహ పురాణ అంతర్గత అష్టోత్తర శతనామాలతో స్వర్ణ పుష్పాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెండి పీఠంపై ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి సమర్పించారు. ప్రతి మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ అష్టదళ పాద పద్మారాధన సేవ (స్వర్ణ పుష్పార్చన) కార్యక్రమం ఆలయంలో ఆర్జిత సేవగా నిర్వహిస్తామని కార్య నిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



దాతలకు ఆశీర్వాదం ఇస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న శ్రీహరిహర సుత అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామి వారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మండపారాధన, పుణ్యాహవచనం, మూలవిరాటుకు, పంచామృత అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమం, నీరాజనం, మంత్ర పుష్పాలు అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. జంగారెడ్డిగూడేనికి చెందిన భక్తులు గెట్టెం శ్రీదేవి దిలీప్ కుమార్, తేజశ్రీ దంపతులు రూ.5 వేలు, పామర్తి వెంకటేశ్వరరావు, వెంకట పద్మావతి దంపతులు రూ.5 వేలు అన్నదాన నిమిత్తం అందజేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమాలను ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, నెక్కలపూడి సూర్యచంద్రరావు, కొల్లిపర కృష్ణారావు, బాకీ శ్రీనివాస్‌రెడ్డిలు పర్యవేక్షించారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభుగా వెలసిన శ్రీమద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా తెల్లవారు జామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. షిరిడీ సాయి భజన సమాజం, ఏలూరు, సాయి మారుతి భజన సమాజం, వీరిశెట్టిగూడెం వారు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నానికి దేవస్థానానికి పలు సేవల, విరాళాల ద్వారా రూ.1,88,558 సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

రైతులు జీవన ఎరువులు వాడాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: రామానుజపురం, వేదాంతపురం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కేఎస్ఎన్ పోసారావు ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ జీవన ఎరువులు (బయో ఫెర్టిలేజర్స్) అనగా పాస్ఫో బ్యాక్టీరియా, కెఆర్‌బీ (పొటాషియం)ను విడుదల చేయు ఎరువు అన్నారు. ఈ జీవన ఎరువులు వాడడం వలన పంటలకు నాణ్యత గల ఎరువులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.బాలాజి తదదితరులు పాల్గొన్నారు.

పోతునూరులో పొలం పిలుస్తోంది

చింతలపూడి: మండలంలోని పోతునూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో కలుపు నివారణ, తెగుళ్ల, యాజమాన్య పద్ధతులపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం.. నరకప్రాయం

- తరచూ బ్రేక్ డౌన్ అవుతున్న బస్సులు
- సమయానికి గమ్యస్థానానికి చేరని వైనం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- తీరు మార్చుకోని ఆర్టీసీ అధికారులు



గుర్వాయిగూడెం వద్ద బ్రేక్ డౌన్ అయిన జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో బస్సు



జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్

జంగారెడ్డిగూడెం: నడి రోడ్డుపై బస్సులు ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు గమ్యాన్ని చేరుకునేందుకు అవస్థలు పడుతున్నారు. అయినా ఆర్టీసీ అధికారుల తీరు మాత్రం మారడం లేదు. తరచూ బ్రేక్ డౌన్ అవుతున్నా, కండీషన్ లేని బస్సులను తిప్పుతూ ప్రయాణీలను ఇబ్బందులు పెడుతున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు గమ్య స్థానాలకు తీసుకెళ్లే లోపే ఏదో ఒక చోట బ్రేక్ డౌన్ అవుతున్నా యి. మరో బస్సు వచ్చే వరకు వేచి ఉండాల్సి రావడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అవస్థల ప్రయాణాలు ఇంకెన్నాళ్లని ప్రశ్నిస్తున్నారు.

తరచుగా ఘటనలు

బస్సులు బ్రేక్ డౌన్ అవడం, ప్రయాణికులు రోడ్డుపై నిలబడి వేచి చూడటం తరచుగా జరుగుతున్నాయి. అత్యవసర పనులపై వెళ్లే వారు మొరాయిస్తున్న బస్సుల దెబ్బకు బెంబేలెత్తుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే జేబులు గుల్లవుతున్నాయని వాపోతున్నారు. తరచుగా ఘటనలు చోటు చేసుకుంటున్నా ఆర్టీసీ అధికారుల తీరు మారకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త బస్సులను ఏర్పాటు చేయడం, ఉన్న బస్సులను మంచి కండీషనల్‌లో ఉండేలా మరమ్మతులు చేయడం వంటివి చేపట్టాలని ప్రజలు సూచిస్తున్నారు.

బస్సుల మొరాయింపు పునరావృతం

జంగారెడ్డిగూడేనికి చెందిన ఆర్టీసీ డిపో బస్సు తిరిగి మరోసారి మొరాయించింది. మంగళవారం జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు బయలు దేరిన పాసింజర్ సర్వీస్ బస్సు గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిలిచిపోయింది. ఈ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, వ్యాపారులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అలాగే ఈ నెల 19వ తేదీన కూడా జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళుతున్న బస్సు గుర్వాయిగూడెం సమీపంలోనే బ్రేక్‌డౌన్ కావడం గమనార్హం. డిపోకు చెందిన మెకానిక్‌లు వచ్చి సమస్యను పరిష్కరించేంత వరకు ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు పడాల్సి వచ్చింది. గత మూడు నెలల కాలంలో అనేక మార్లు జంగారెడ్డిగూడేనికి చెందిన బస్సులు రోడ్డుపైనే బ్రేక్‌డౌన్ అయిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

ఈ బస్సులతో ఉచిత ప్రయాణమా?

తరచుగా బస్సులు రోడ్డుపై ఆగిపోవడం వంటి ఘటనలు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాలం చెల్లిన, కండిషన్‌లో లేని బస్సులతో పథకాన్ని అమలు చేయడం అంటే ప్రజలతో చెలగాట మాటడమేనని పలువురు పేర్కొంటున్నారు. తరచుగా బస్సులు బ్రేక్‌డౌన్ కావడంతో ఉచిత బస్సు ప్రయాణం దేవుడెరుగు, కనీసం కండిషన్ బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కొత్త బస్సులు ఏర్పాటు చేయాలి

కాలం చెల్లిన బస్సులతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణాలు సవ్యంగా సాగడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో బస్సులు అర్ధాంతరంగా ఆగిపోతుంటే అవస్థలు పడుతున్నాం. నూతన బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలి. అప్పటి వరకు కనీసం కండిషన్‌లో ఉన్న బస్సులు అయినా తిప్పాలి.

– ఎస్.అనిల్ కుమార్, దేవులపల్లి

కండిషన్ బస్సులను తిప్పాలి

ఆర్టీసీ ప్రయాణం సుఖమయం, సురక్షితం అని కేవలం బస్సులు వెనకమాల రాయడానికి తప్పితే వాస్తవంగా అలా జరగడం లేదు. డిపో నుంచి బయలు దేరిన బస్సులు ఏదో ఒక చోట బ్రేక్ డౌన్ కావడం ఇటీవల కాలంలో తరచుగా చూస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలం చెల్లిన బస్సులను గ్యారేజ్‌లకే పరిమితం చేసి మంచి బస్సులను తిప్పాలి. ఆర్టీసీపై ప్రయాణికులకు భరోసా కల్పించాలి.

–వెదుళ్లపల్లి హరిబాబు, జంగారెడ్డిగూడెం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి మండలం పి.నారాయణపురం సబ్‌స్టేషన్ పరిధిలో పి.నారాయణపురం రూరల్ ఫీడర్‌పై ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహించనున్నారు. ఈ పనుల నిమిత్తం 30వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఇన్‌చార్జి విద్యుత్ ఈఈ యు.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున పి.అంకంపాలెం, ఆర్‌అండ్‌కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గిరిజన రైతులకు మొక్కల పంపిణీ



మంగయ్యపాలెంలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బుట్టాయగూడెం: మండలంలోని మంగయ్యపాలెం, నాగంపాలెం, కుమ్మరికుంట, కొమరవరం, తదితర గ్రామాల్లో యాక్షన్, ఆజీమ్ ప్రేమజీ ఫౌండేషన్ సహకారంతో గిరిజన రైతులకు హైబ్రీడ్ జీడిమామిడి మొక్కలు పంపిణీ చేసినట్లు యాక్టింగ్ సంస్థ కోఆర్డినేటర్‌లు సాల్మన్‌రాజు, జ్యోతిబాబులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వారు విలేకర్లతో మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా గిరిజన రైతులకు ఒక్కో రైతుకూ 60 చొప్పున 50 మంది రైతులకు జీడిమామిడి మొక్కలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ హోం మంత్రి వనిత పరామర్శలు



చికిత్స పొందుతున్న మాధవ్‌ను పరామర్శిస్తున్న మాజీ హోంమంత్రి వనిత

ద్వారకాతిరుమల: మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత మంగళవారం పరామర్శించారు. ముందుగా ఆమె ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కాలి గాయంతో చికిత్స పొందుతున్న తిమ్మాపురం గ్రామ సర్పంచ్ ఎర్రగొల్ల రజని భర్త మాధవ్‌ను, అలాగే అనారోగ్యంతో అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలంపాలేనికి చెందిన ఆదూరి నాగరాజును పరామర్శించారు. అనంతరం పంగిడిగూడెంలో గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి యోహానును, అదే గ్రామానికి చెందిన బోరుగడ్డ బుల్లిస్వామిని పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే పార్టీ బలోపేతం



గ్రామాధ్యక్షుడిగా ఎన్నికైన మోహన్‌రావును సత్కరిస్తున్న కంభం విజయరాజు

కామవరపుకోట: కార్యకర్తల సమన్వయంతోనే పార్టీ బలోపేతం సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. రామన్నపాలెం గ్రామాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పలపాటి మోహన్‌రావును మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో విజయరాజు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ గ్రామంలో అందరినీ కలుపుకుంటూ సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకు గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి గ్రామస్తులకు వారి మోసాలను తెలియజేయాలన్నారు. ఏడాది కూటమి పాలనతో ఆ ప్రభుత్వంపై ప్రజలలో పూర్తి వ్యతిరేకత ఏర్పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీకి రానున్నవి మంచి రోజులని, ప్రతి కార్యకర్త ధైర్యంతో పార్టీ గెలుపునకు సైనికుడిలా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి శ్రీనివాసరావు, నార్ని సతీష్, పాకలపాటి గాంధీ, కుచ్చులపాటి మహేష్, బొబ్బిలి ఆనందరావు, కానూరు రామయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి



సచివాలయంలో వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

చింతలపూడి: కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం రేచర్ల మల్లాయ గూడెం గ్రామ సచివాలయాల్లో రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దొంతా కృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని, సబ్సిడీతో కూడిన విత్తనాలు ఎరువులు అందించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించి భూమిలేని కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్కిలపాటి ప్రసాద్ రావు, కంచర్ల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు





జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కానిస్టేబుళ్లు

చింతలపూడి/జంగారెడ్డిగూడెం: విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు లభించాయి. మంగళవారం ఏలూరులో నిర్వహించిన సెల్ ఫోన్ల రికవరీ మేళాలో జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ చేతుల మీదుగా కానిస్టేబుళ్లు పల్లి విజయ్, షేక్ షాన్‌బాబులకు ప్రశంసా పత్రాలను అందించారు. చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో 32 సెల్ ఫోన్లు, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో 40 సెల్ ఫోన్లను రికవరీ చేశారు. వీరిని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

ప్రధాన రోడ్లకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, తదితరులు

జంగారెడ్డిగూడెం: ప్రధాన రోడ్ల మరమ్మతులకు మున్సిపల్ పాలకవర్గం నడుం బిగించింది. ప్రధాన రోడ్డు మార్గమైన ఏలూరు రోడ్డు, బుట్టాయగూడెం రోడ్లు గోతులతో ఛిద్రమయ్యాయి. ప్రజలు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు రోడ్ల సమస్యను తీర్చే క్రమంలో మున్సిపల్ పాలకవర్గం ప్రధాన రోడ్డు మార్గాల మరమ్మతులకు సంకల్పించింది. దీంతో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఏలూరు రోడ్డులోని లక్ష్మీ థియేటర్ నుంచి బుట్టాయగూడెం రోడ్డులోని పొట్టి శ్రీరాముల విగ్రహం వరకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పనులను చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, పట్టణాభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్లు పీపీఎస్ చంద్రరావు, నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, మునిపల్ కమిషనర్ కొమ్మినేని వెంకటరమణ, ఏఈ రాజేష్, సెక్రటరీ కమలానంద్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, టీడీపీ నాయకులు కొండరెడ్డి కిషోర్, చిట్టిబోయిన రామలింగేశ్వరావు, పరిమి సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి నాగ పంచమి పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, చెరువు వీధిలో కొలువైన శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. నాగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి తరలివచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భారీ అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: అశ్వారావుపేట రోడ్ రాజుల కాలనీ ముఖద్వారంగా వేంచేసి ఉన్న సుందర బాలసుబ్రమణ్యేశ్వర ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రావణ మాసం స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం, నాగుల పంచమి కావటంతో వందలాదిగా భక్తులు ఆలయానికి పోటెత్తారు. సుమారు 3 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి శ్రీరామరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

గణిత శాస్త్ర విభాగంలో అతిథి ఉపన్యాసం

జంగారెడ్డిగూడెం: గణిత శాస్త్ర విభాగంలో దత్తాంశ వివరణ(డేటా ఇంటర్ పిటేషన్) అనే అంశంపై అతిథి ఉపన్యాసం జంగారెడ్డిగూడెం ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో దత్తాంశ వివరణ అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు యు. వెంకటాచార్యులు, కళాశాల ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, తెలుగు విభాగ అధిపతి జి.వెంకట లాల్, కామర్స్ విభాగ అధిపతి కె.ఉత్తమ్ సాగర్, సీహెచ్ రమాదేవి పాల్గొన్నారు.

దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్

పోలవరం రూరల్: దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే నిర్మూలన చేపట్టాలని ఐటీడీఏ పీవో రాములు నాయక్, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామంలో మంగళవారం డ్రోన్ ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని సరిపల్లికుంట వెళ్లే దారిలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో డ్రోన్ ద్వారా దోమ డింభక నాశనాలను చల్లారు. ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి, ఎంపీహెచ్ఈవో, అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మొక్కల కీలకపాత్ర



గో గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: స్థానిక జంగారెడ్డిగూడెం నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గో గ్రీన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పర్యావరణం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ ఆర్.ధర్మారావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ప్రధాన పాత్ర వహిస్తాయని, వాటిని నాటడం, పరిరక్షించడం, పోషించడం కూడా దైవ కార్యమేనని తెలిపారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి పర్యావరణాన్ని, మట్టిని, వాతావరణాన్ని రక్షించడమే భావిభారత ప్రధాన కర్తవ్యమని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అటవీ, పోలీస్, శాఖ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ వి.లక్ష్మీనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నాగ, గరుడ పంచమి వేడుకలు

కొయ్యలగూడెం: నాగ, గరుడ పంచమి వేడుకలు మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం టెంపుల్స్ సెంటర్‌లోని ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి యాభై నాలుగు లీటర్ల ఆవు పాలతో అభిషేకం, ఐదు కేజీల గులాబీ పుష్పాలతో అర్చన కార్యక్రమాలను అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గరుడ పంచమి నేపథ్యంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారి ఆలయంలోని గరుత్మంతునికి పంచామృత అభిషేకం చేశారు. బయ్యనగూడెం, పోతవరం రోడ్డు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు.

3న వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమ కరపత్రాన్ని విడుదల చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: కష్టాలను తీర్చే వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెం పట్టణంలో తొలిసారిగా నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మికవేత్త ఈమని శశికుమార్ శర్మ తెలిపారు. స్థానిక పద్మా థియేటర్ ఎదురుగా రెండో వార్డ్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రంలో ఉప ఆలయంగా వారాహి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన మహోత్సవ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రధాన అర్చకులు కురెళ్ల రాంబాబు శర్మ ఆధ్వర్యంలో ఆగస్టు రెండో తేదీ వారాహి అమ్మవారి మూల విరాట్‌కు దాన్యాధివాసం, జలాధివాసం, హోమాది కైంకర్యాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం భారీ స్థాయిలో అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి



చింతలపూడి: సంతకాల సేకరణ చేస్తున్న వామపక్ష నేతలు



జంగారెడ్డిగూడెం: ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చింతలపూడి: స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో రెండో రోజు ప్రగడవరం గ్రామంలో మంగళవారం సంతకాల సేకరణ చేశారు. సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నట్లు వామపక్ష నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలను ప్రజలపై మోపుతూ స్మార్ట్ మీటర్ల బిగింపు విధానానికి వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీ విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు డి.రంగనాథ్, పి.పాండురంగారావు, తొర్లపాటి బాబు, ఆర్వీ సత్యనారాయణ, డి.సత్యనారాయణ, కంచర్ల గురవయ్య, ఎస్‌కే కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, కె.చంద్రశేఖర్‌రెడ్డి, కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంతకాల సేకరణ

జంగారెడ్డిగూడెం: ఆదాని స్మార్ట్ మీటర్లకు డబ్బులు ఎవరు చెల్లిస్తారో ప్రకటించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదాని స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం, రైతు కూలీ సంఘం నాయకులు జొన్నకూటి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు కుంచె వసంతరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చాక వాటినే అమలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జంపన వెంకటరమణ రాజు, సుంకర రాధాకృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి.బాల యేసు, కె.రామలక్ష్మి, ఎం.వరలక్ష్మి, తాళ్లూరి నాగరాజు, చందా త్రిమూర్తులు, గుదే ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేసిన యువకులపై కేసు నమోదు

చింతలపూడి: ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద మంగళవారం ధర్నా చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్ కుమార్ తెలిపారు. టి.నర్సాపురం మండలంలో పామాయిల్ గెలలు నరకడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము రవీంద్ర కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చింతలపూడిలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి, ప్రజలకు, ప్రయాణికులకు అసౌకర్యం కలిగించిన చింతలపూడి గ్రామానికి చెందిన అత్కూరు సుబ్బారావు, హెచ్చు యోహాను, టి.నర్సాపురం మండలం కె.జగ్గవరం గ్రామానికి చెందిన బొడ్డపాటి శ్యామ్, ఇంగిర్తి కిషోర్, యమండ్రా ప్రదీప్, అగ్నిపర్తి పరాత్పరావు, పరసా సతీష్, కాకాని వెంకన్నబాబు, బొడ్డ పాటి నవీన్, కొండపల్లి అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.